వేడుకలకు సర్వం సిద్ధం



జిల్లాకేంద్రం అంబేద్కర్ చౌరస్తాలో విద్యుత్ దీపాలు



రాజీవ్ సర్కిల్ చౌరస్తాలో..



పెద్దదర్పల్లిలో జాతీయ జెండాలతో విద్యార్థులు



జిల్లా కేంద్రంలో జాతీయ జెండాల కొనుగోలు సందడి



జిల్లా కేంద్రంలో జాతీయ నాయకుల వేషధారణలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం పట్టణంలోని ముఖ్యకూడళ్లతో పాటు మున్సిపల్ కార్యాలయాన్ని రంగురంగుల విద్యుత్ బల్బులతో అందంగా ముస్తాబు చేశారు. ముఖ్యంగా జడ్చర్ల- రాయచూర్ జాతీయ రహదారి (నం.167) పై వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ జంక్షన్, రాజీవ్‌సర్కిల్, అంబేద్కర్‌చౌరస్తా, ఆర్‌అండ్‌బీ జంక్షన్, స్టేషన్‌రోడ్డు, న్యూటౌన్ చౌరస్తా, మెట్టుగడ్డలో వీటిని ఏర్పాటు చేశారు. అలాగే భూత్పూర్ రోడ్డు వైపు బైపాస్ నుంచి కొత్త కలెక్టరేట్ వరకు వీధిదీపాలు, హైమాస్ట్ లైట్ల విద్యుత్ కాంతులతో వెలుగులీనుతున్నాయి. అదేవిధంగా దుకాణాలు కిటకిటలాడాయి.

దేశభక్తి పెంపొందించాలి

హన్వాడ: విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించాలని ఆర్మీ రిటైర్డ్ జవాన్ రఘురాంగౌడ్ పేర్కొన్నారు. సోమవారం పెద్దదర్పల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు జాతీయ జెండాలను ఉచితంగా పంపిణీ చేశారు. స్వాతంత్య్ర దినోత్సవం రోజు ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌ఎస్‌సీఎస్ వైస్‌చైర్మన్ కృష్ణయ్యగౌడ్, బీఎస్‌ఎఫ్ జవాన్ తారకరామగౌడ్, పోస్ట్‌మాస్టర్ శంకర్, హెచ్‌ఎం మురళీకృష్ణ, ఉపాధ్యాయ బృందం, గ్రామపెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

నవాబుపేట: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలో ర్యాలీలు నిర్వహిచారు. బీజేపీ, యువజన సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ద్విచక్రవాహన ర్యాలీలో యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు. యన్మన్‌గండ్ల నుంచి ప్రారంభమైన ర్యాలీ వందేమాతరం నినాదాల హోరుతో మండలం మొత్తం సాగింది. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు యాదయ్య, శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షుడు రాజు, ఆంజనేయులు, రామకృష్ణ, శ్రీశైలం, రాఘవేందర్, బస్వరాజ్, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కార్యకర్తలకు అండగా బీఆర్‌ఎస్

భూత్పూర్: బీఆర్‌ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం మద్దిగట్లలో సీనియర్ కార్యకర్త వడ్ల బ్రహ్మయ్య (60) అనారోగ్యంతో మృతిచెందగా ఎమ్మెల్యే బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వం, పార్టీ పరంగా ఆదుకుంటామన్నారు. అదేవిధంగా మద్దిగట్లలో వెంకటేష్ అనారోగ్యంతో సోమవారం మృతిచెందగా విషయం తెలుసుకున్న ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి పాడే మోశారు. బాధిత కుటుంబానికి రూ.5వేల ఆర్థికసాయం చేయడంతో పాటు అండగా ఉంటామని భరోసానిచ్చారు. మత్స్య సహకారం సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, సర్పంచ్ ప్రియాంక, ముడా డైరెక్టర్ సాయిలు, సీనియర్ నాయకులు ఉన్నారు.

దేశరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

పాలమూరు: దేశరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీర బ్రహ్మచారి అన్నారు. దేశ విభజనలో పాకిస్థాన్, బంగ్లాదేశ్ మూకల వల్ల 20వేల మంది మృతి చెందారని పేర్కొన్నారు. పాలమూరు శాఖ పార్టీ కార్యాలయం నుంచి అమరవీరుల స్థూపం వరకు మౌన ప్రదర్శన నిర్వహించారు. నివాళులు అర్పించారు. బీజేపీ నేత పి.చంద్రశేఖర్, బాలరాజు, కృష్ణవర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పాండు రంగారెడ్డి, అంజయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి, నారాయణ యాదవ్ పాల్గొన్నారు.

బీసీబంధు చెక్కుల పంపిణీ



గండీడ్: గ్రామీణ ప్రాంతాల్లోని వెనుబడిన కుటుంబాలను ఆర్థికంగా ఎదిగేలా చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన బీసీ బంధు చెక్కుల పంపిణీకి హాజరై మాట్లాడారు. ఉమ్మడి మండలానికి చెందిన 58మందికి చెక్కులు అందజేశారు. అన్ని వర్గాల వారిని ఆదుకోవడం కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు. ఎంతో అభివృద్ధి చేస్తున్న బీఆర్‌ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని అన్నారు. అదేవిధంగా ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని వివరించారు. ఐకమత్యంతో పనిచేస్తూ ముందుకు సాగాలని సూచించారు. ఎంపీపీ మాధవి, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మండలాల అధ్యక్షులు భిక్షపతి, పెంట్యానాయక్, ఆయా గ్రామాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం విధానాలకు వ్యతిరేకంగా 'రాత్రికేక'

భూత్పూర్: కేంద్ర ప్రభుత్వం కార్మికులపై అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా రాత్రి కేక (నైట్ విజిల్) కార్యక్రమం చేపడుతున్నట్లు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వి.కురుమూర్తి అన్నారు. సోమవారం రాత్రి భూత్పూర్ చౌరస్తాలో మహాత్మాగాంధీ విగ్రహం వద్ద 60 మంది అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, గ్రామ పంచాయతీ పారిశుద్ధ కార్మికులతో రాత్రి 8 గంటల నుంచి మధ్యరాత్రి 12:30 గంటల వరకు నిరసన కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలన్నారు. 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. పంచాయతీ వర్కర్స్ యూనియన్, ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి వెంకటేష్ గౌడ్, మండల అధ్యక్షుడు మైబు, కార్యదర్శి నారాయణ, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామ పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ రూరల్: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఉన్న మదాసీ కురువ, మదారి కురువ కులస్తుల విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధన్వాడ రాములు తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ 2023- పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. సంబంధిత ధ్రువపత్రాల జీరాక్స్ కాపీలను ఈనెల 24లోపు అందజేయాలని వివరాలకు 9490707492, 8978983884 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఈత మొక్కలను సంరక్షించాలి

కోయిల్‌కొండ: గ్రామాల్లో చెరువు కట్టలపై ఈత మొక్కలను నాటి సంరక్షించాలని ఎంపీడీఓ జయరాములు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మైసమ్మ దగ్గర ఉన్న చెరువు కట్టపై నాటిన ఈత మొక్కలను ఆయన పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో మేరి మట్టి- మేరి దేశ్‌లో భాగంగా పంచాయతీ కార్యదర్శులతో ప్రతిజ్ఞ చేయించారు. సూపరింటెండెంట్ హరిశ్చంద్రారెడ్డి, ఎంపీఓ నజీర్, ఏపీఓ నర్సయ్య పాల్గొన్నారు.

తారకను సన్మానించిన డీఎస్పీ



అడ్డాకుల: మండలంలోని బలీదుపల్లి గ్రామానికి చెందిన వెంకటేష్ యాదవ్, వెంకటేశ్వరమ్మ దంపతుల కుమార్తె తారక ఇటీవల సివిల్ ఎస్‌ఐ ఉద్యోగానికి ఎంపిక కావడంతో ఆదివారం రాత్రి డీఎస్పీ బంటు కిషన్ ఆమెను ఇంటికి వెళ్లి సన్మానించారు. తారకతో పాటు ఆమె తల్లిదండ్రులను సత్కరించి జ్ఞాపికను అందజేశారు. పట్టుదలతో తారక సివిల్ ఎస్‌ఐ ఉద్యోగం సాధించి నేటి యువతకు ఆదర్శంగా నిలిచిందని డీఎస్పీ పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు శ్రీధర్‌యాదవ్, అమ్మపల్లి బాలు, పాల్గొన్నారు.

విద్యార్థులకు సామగ్రి అందజేత



హన్వాద: దొర్రితాండ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం రిటైర్డ్ ఉపాధ్యాయుడు లింగాచారి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు సుధాకర్ స్కూల్ బ్యాగులు, బూట్లు, సాక్స్‌లు పంపిణీ చేశారు. సుమారు రూ.60వేలు విలువ చేసే సామగ్రిని పంపిణీ చేయడంతో ఉపాధ్యాయులు, తదితరులు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు.

16 నుంచి నిరవధిక సమ్మె

జడ్చర్ల టౌన్: రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 16నుంచి నిరవధిక సమ్మె చేస్తున్న 2వ ఏఎన్‌ఎంలకు మద్దతుగా నిలిచి జయప్రదం చేద్దామని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తెలుగు సత్తయ్య పిలుపునిచ్చారు. అర్బన్ పరిధిలోని 2వ ఏఎన్‌ఎంలతో కలసి తహసీల్దార్ శ్రీనివాసులకు సమ్మె నోటీసును అందజేశారు.

కొనసాగుతున్న రిలేదీక్షలు

కోయిల్‌కొండ: గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించాలని చేపట్టిన రిలే దీక్షలు సోమవారానికి 204వ రోజుకు చేరుకున్నాయి. ఈసందర్భంగా మండల కన్వీనర్ రామునాయక్, వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం మండలం ప్రకటించే వరకు రిలేదీక్షలు ఆపేదిలేదన్నారు. మండలసాధన సమితి సభ్యులు పాల్గొన్నారు.

దండోర కమిటీ ఎన్నిక

హన్వాడ: మండల పరిధిలోని బుద్దారంలో నూతన దండోర కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా డి.చెన్నయ్య, డి.యాదయ్య, ఉపాధ్యక్షుడిగా నర్సిములు ఎన్నికయ్యారు. మండల అధ్యక్షుడు రాములు, నాయకులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

రాజాపూర్: బాలానగర్ మండల తహసీల్దార్‌గా శ్రీనివాస్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కాగా ఇక్కడ పనిచేసిన శ్రీనివాస్ జడ్చర్ల తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లారు.

పాలాభిషేకం

కోయిల్‌కొండ: మండలంలోని కొత్లాబాద్, కోయిల్‌కొండ గ్రామాలలో చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంపై సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి చిత్రపటాలకు నాయకులు పాలాభిషేకం చేశారు. జెడ్పీటీసీ విజయ్‌భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ రూ.56.75 కోట్లు మంజూరు అయినట్లు వివరించారు. రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు మల్లయ్య, భీంరెడ్డి పాల్గొన్నారు.

స్కూల్ స్వీపర్ల సమస్యలు పరిష్కరించాలని వినతి



భూత్పూర్: స్కూల్ స్వీపర్ల సమస్యలు పరిష్కరించాలని నాయకులు అన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డికి సోమవారం సమస్యలు పరిష్కరించాలంటూ అన్నాసాగర్‌లో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ స్వీపర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గట్టన్న, జిల్లా అధ్యక్షుడు ఎస్ చంద్రాయుడు, టీఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎం ఖలీల్, జిల్లా నాయకుడు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ, ఐటీఐ కళాశాలలు ఏర్పాటు చేయాలి



నవాబుపేట: మండలంలో డిగ్రీ, ఐటీఐ కళాశాలలు ఏర్పాటు చేయాలని బీజేవైఎం నాయకులు ఆంజనేయులు, రామకృష్ణ కోరారు. సోమవారం యువజన సంఘాలతో కలిసి తహసీల్దార్ మల్లికార్జునరావుకు వినతిపత్రం అందించారు. కళాశాలలు తప్పక నెలకొల్పాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, రాము, రఘు, శంకర్, శేఖర్ పాల్గొన్నారు.

పరామర్శ

చిన్నచింతకుంట: బీజేపీ కార్యకర్తలకు, నాయకులకు అండగా ఉంటుందని పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డికే అరుణ అన్నారు. అనారోగ్యంతో మరణించిన పార్టీ సీనియర్ నాయకుడు కడుదాస్ పురుషోత్తం దశదినకర్మ సోమవారం చిన్నచింతకుంటలో నిర్వహించగా ఆమె హాజరై అతడి చిత్రపటానికి నివాళి అర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పద్మజారెడ్డి, కృష్ణారెడ్డి ఉన్నారు.

రేపు సమావేశం

జడ్చర్ల టౌన్: బ్రహ్మకుమారీస్ మహిళా విభాగం ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు దైవి సోదరి సోమవారం తెలియజేశారు. సమావేశానికి భారీసంఖ్యలో హాజరుకావాలని పేర్కొన్నారు.

ఖాళీలను భర్తీ చేయాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా జనరల్ ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న డాక్టర్ల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కురుమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఏఓ శంకర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతు ఆస్పత్రి వివిధ విభాగాల్లో పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. వెంటనే భర్తీ చేయకపోతే ఆందోళనలు చేపడతామన్నారు. కార్యక్రమంలో విష్ణువర్ధన్, రాజ్‌కుమార్, శ్రీనివాసులు, కేశవులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణులకు అన్యాయం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): బీసీ బంధు పథకంలో నాయీ బ్రాహ్మణులకు అన్యాయం చేశారని నాయకులు అన్నారు. ఈ మేరకు సంఘం కోయిలకొండ అధ్యక్షుడు కృష్ణయ్య ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ రవినాయక్‌కు వినతి పత్రం సమర్పించారు. న్యాయం చేయాలని కోరారు. నాయకులు శేఖర్, ధన్‌రాజు, బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

'దళితులను మోసం చేశారు'

మహమ్మదాబాద్: రాష్ట్రం ఏర్పాటయ్యాక దళిత ముఖ్యమంత్రిని చేస్తామని, మూడెకరాల భూమిని ఇస్తామని బీఆర్‌ఎస్ ప్రభుత్వం మోసం చేసిందని పరిగి మాజీ ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. నంచర్లగేట్ వద్ద సోమవారం కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. దళితులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా అన్యాయం చేశారని అన్నారు. ప్రాజెక్టుల పేరుతో దోచుకోవడం, యువతకు ఉద్యోగాలు ఇవ్వకపోవడం, ధరణి ద్వారా పేదల భూములను పెత్తందారులకు అప్పగించడం వంటివి చేసింది బీఆర్‌ఎస్ కాదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ హయంలోనే దళిత వాడలు అభివృద్ధి చెందాయని గుర్తుచేశారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయమన్నారు. మండల అధ్యక్షుడు కేఎం నారాయణ, టీపీసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి రాములు, వర్కింగ్ ప్రెసిడెంట్ రాఘవేందర్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

భూత్పూర్: మద్దిగట్ల, పోతులమడుగు, ఎల్కిచర్లతో పాటు పలు గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు హైదరాబాద్‌లో రేవంత్‌రెడ్డి సమక్షంలో సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు జి.మధుసుదన్ రెడ్డి, మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు వెంకట్ నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

హన్వాడ: మండల పరిధిలోని సల్లోనిపల్లి, హన్వాడ, దాచక్‌పల్లి, మునిమోక్షం, మాదారం, నాగంబాయితండా గ్రామాల నుంచి పలువురు సోమవారం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. హన్వాడ మాజీ సర్పంచ్ కృష్ణయ్య, నాయకులు వెంకటయ్య, చెన్నయ్య, వెంకట్‌రెడ్డి, రామకృష్ణ, జానకిరెడ్డి, చంద్రయ్య, జిల్లానాయకులు ఎస్‌పీ వినోద్, సంజీవ్‌ముదిరాజ్, సిరాజ్‌ఖాద్రి, లక్ష్మణ్ యాదవ్, ఫయాజ్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో..

అడ్డాకుల: మూసాపేట మండలం కొమిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన 50 మంది కాంగ్రెస్ కార్యకర్తలు సోమవారం ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. జెడ్పీటీసీ సభ్యుడు జి.ఇంద్రయ్యసాగర్, కొమిరెడ్డిపల్లి సర్పంచ్ సాయిరెడ్డి, పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహ్మ, మాజీ ఎంపీపీ బగ్గి కృష్ణయ్య, నాయకులు రవీందర్‌గౌడ్ ఉన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

దేవరకద్ర: మండలంలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో ఖిల్లాఘన్‌పూర్ మండలానికి చెందిన కుర్వ రామకృష్ణ, దేవరకద్రకు చెందిన ఎరుకలి రాజు పట్టుబడినట్లు ఎస్‌ఐ వెంకటేశ్ తెలిపారు. సోమవారం వారిని కోర్టులో హాజరు పరచగా రామకృష్ణకు రెండు రోజులు, రాజుకు ఒక రోజు జైలు శిక్షణ విధించారని వివరించారు.

నేడు ఎమ్మెల్యే రాక..

దేవరకద్ర: స్వాతంత్య్ర దినోత్సవం నేపథ్యంలో.. వేడుకల్లో భాగంగా మంగళవారం ఉదయం 8.30 గంటలకు క్యాంపు కార్యాలయంలో నిర్వహించే పతాకావిష్కరణ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి హాజరు అవుతారని పట్టణ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు బాల్‌రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.